క్లుప్తంగా

మాక్ పోలింగ్



ఓటు వినియోగించుకుంటున్న విద్యార్థులు

మానకొండూర్: మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికలు కీలకపాత్ర పోషిస్తాయని, భావి భారత పౌరులైన విద్యార్థులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ పద్మశ్రీ మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియపై చిన్నప్పటి నుంచే అవగాహన కలిగి ఉంటే భవిష్యత్‌లో పౌరులు చైతన్యవంతులు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర టీచర్ల ఫాతిమా సుల్తానా, అశోక్ కుమార్, శ్రీనివాస్, కళావతిపాల్గొన్నారు.

సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేసిన బీజేపీ నాయకులు

సైదాపూర్: కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం పురస్కరించుకొని ప్రధాని మోదీ కానుకగా మండల కేంద్రంలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం బీజేపీ మండల నాయకులు, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి సైకిళ్లు పంపిణీ చేశారు. కరీంనగర్‌లో పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్లు అందజేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దంచనాల శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకుడు జంపాల సంతోష్, జిల్లా కార్యదర్శి రవీందర్‌రెడ్డి, మాజీసర్పంచ్ రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ జెల్ల మల్లేష్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పాలనలో హిందువులకు స్వేచ్ఛలేదు



మాట్లాడుతున్న రమణారెడ్డి

ఇల్లందకుంట: అక్రమ అరెస్టులు దురదృష్టకరమని, కాంగ్రెస్ పాలనలో హిందువులకు స్వేచ్ఛలేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి మాట్లాడారు. హైదరాబాద్‌లోని పెద్దమ్మగుడి దగ్గర కుంకుమార్చనకు హిందూ సంఘాల పిలుపు మేరకు హైదరాబాద్‌కు బయలుదేరుతున్నారనే సమాచారంతో ముందస్తుగా పార్టీ, హిందూ సంఘాల నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం హేయమైన చర్య అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తికొండ రాంబాబు, రావుల విజయ్‌బాబు, శ్రీకాంత్, భరత్ పాల్గొన్నారు.

అరెస్ట్ అప్రజాస్వామికం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంటరూరల్ : ఇండియా కూటమి సభ్యుల అరెస్టు అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు అంబాల రాజు అన్నారు. మంగళవారం మండలంలోని మడిపల్లి గ్రామంలో మాట్లాడారు. ఓట్ల గల్లంతుపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియంక గాంధీ తోపాటు విపక్ష పార్లమెంట్ సభ్యులు ప్రశ్నిస్తే అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని, ఓట్ల గల్లంతుపై ఎలక్షన్ కమిషనర్ వాస్తవాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ సదానందం, యువజన కాంగ్రెస్ నాయకులు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి మ్యాకమల్ల అశోక్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల సాంబశివరెడ్డి, యువజన నాయకుడు రామిడి సూర్యతేజారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

మానకొండూర్: మండలంలోని చెంజర్లలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 60 మందికి పరీక్షలు చేసి 35 మందికి ఆపరేషన్ అవసరమని తెలిపారు. కార్యక్రమంలో మానేరు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ముత్యం శంకర్‌గౌడ్, సెక్రెటరీ కృష్ణ ,చింత సురేష్, రమేష్, గణేష్, గొల్లెన కొమురయ్య, బుర్ర చంద్రకర్ గౌడ్, పెట్టెం రమేష్, కరోబార్ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో సమస్యల తాండవం



బోర్నపల్లి గ్రామంలోని నివాస గృహాల పక్కన ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధి విలీన గ్రామాల్లోని ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. సమస్యలతోనే సాహవాసం చేస్తున్నారు. సరైన రోడ్లు, మురుగుకాలువలు, వీధి దీపాలు లేక అవస్థలుపడుతున్నారు. దమ్మక్కపేట, ఇప్పలనర్సింగాపూర్, బోర్నపల్లి గ్రామాల్లోని పలు కాలనీల్లో అనేక సమస్యల తాండవిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు విలీన గ్రామాల్లోని రోడ్లు గుంతలమాయంగా మారడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాపోతున్నారు. వర్షాకాలంలో కాలనీలవాసుల బాధలు వర్ణణాతీతం. దీనికి తోడు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. మురుగుకాలువల్లోని సిల్టును తొలగించకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని రాత్రిపూట కంటి మీద కునుకు లేకుండా పోతోందని, రోగాల బారినపడుతున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయని, కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పాములు, తేళ్లు, క్రిమికీటకాలకు విడిదిగా మారుతున్నాయని, పందులు, పశువులు, కుక్కలు, కోతులు పగలు, రాత్రి సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, విలీన గ్రామాల్లోని శివారుకాలనీల్లో పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని, వీధి దీపాలు లేకపోవడంతో అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. రాత్రిళ్లు ఇంటి నుంచి బయటికి వెళ్లడానికి ప్రజలు జంకుతున్నారు.

ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం కలిగించండి



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్: ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ పాఠశాలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగిస్తే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గంగిపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ ల్యాబ్, లైబ్రరీని ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాఠశాలల్లో అనేక వసతులు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూ సమస్యలు పరిష్కరించాలి

గన్నేరువరం: గన్నేరువరం, తిమ్మాపూర్ మండలాల్లోని గోపాల్‌పూర్, జూగుండ్ల గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యను వారం రోజుల్లో పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా భూ సర్వే, భూరికార్డుల శాఖ సహాయ సంచాలకులతో కలిసి మంగళవారం ఆయా గ్రామాలను సందర్శించి, సమస్యాత్మక ఎనిమిదెకరాల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఓ గ్రామంలో రైతు, దళితుల మధ్య భూ వివాదం ఏళ్లుగా కొనసాగుతుందని, రికార్డుల్లోని భూమి మోఖాపై లేదని, భూమి ఆక్రమణకు గురైందని దళితులు ఆందోళన చెందుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే జిల్లా యంత్రాంగాన్ని ఇక్కడికి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఎనిమిది ఎకరాలకు హద్దులు నిర్ణయించాలని, సత్వరమే భూ సర్వే చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. చాలా కాలంగా నెలకొన్న భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. న్యాయం చేయాలని దళితులు ఎమ్మెల్యే, అధికారులను వేడుకున్నారు. వివాదంపై సమావేశంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తిమ్మాపూర్ సర్కిల్ సీఐ సదన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గన్నేరువరం, తిమ్మాపూర్ మండలాల తహసీల్దార్లు నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు అనిల్‌కుమార్, శ్రీనివాస్, రాజు, సతీష్, బాలయ్య, హసన్ పాల్గొన్నారు.

యూరియా తిప్పలు



క్యూలో నిల్చొన్న రైతులు

ఇల్లందకుంట: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడంలేదు. మండలంలోని సిరిసేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి 450 యూరియా బస్తాలు రాగా పది గ్రామాల రైతులు ఒకే సారి రావడంతో రైతుల మధ్య తోపులాట, గొడవలు జరిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సొసైటీ కార్యదర్శి పర్కాల శ్రీనివాస్, సిబ్బంది మహేష్‌తో మాట్లాడి పంపిణీ నిలిపివేశారు. బుధవారం పోలీసుల సమక్షంలో పంపిణీ చేయాలని, రైతులకు సర్దిచెప్పి ఇంటికి పంపించారు.

ప్రత్యేక పూజలు



పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు

ఇల్లందకుంట: ఇల్లందకుంటలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ఆంజనేయస్వామి జన్మనక్షత్రం పుర్వాభాద్ర సందర్భంగా మంగళవారం గ్రామస్తులు, శ్రీరామదూత సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం గ్రామ వీధుల గుండా పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీమాన్ గోపినాధాచార్యులు, శ్రీమాన్ బట్టర్ శేషాచార్యులు, గ్రామస్తులు, శ్రీరామదూత సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



జమ్మికుంట: జెండా ఎగురవేస్తున్న నాయకులు



హుజూరాబాద్‌లో...

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

హుజూరాబాద్: పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన విద్యార్థి సంఘం స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వ విద్యా పరిరక్షణపై నిరంతరం పోరాటం సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రోహిత్,గణేష్, శ్రీకాంత్, మణికంఠ, రవి, కిరణ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలో అఖిల భారత విద్యార్థి సమైక్య(ఏఐఎస్ఎఫ్) ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా మాజీ నాయకులు మాదారపు రత్నకార్ హాజరై జెండా ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా శాస్త్రీయ విద్యావిధానం ఉద్యమాలే ఊపిరిగా విద్యా రంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడుతుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం, మలిదశ ఉద్యమంలో పోరాటం చేసిందన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు, నాయకులు రాకేష్, సురేందర్, రఘు, రాముల్, రాజ్, సరీఫ్ పాల్గొన్నారు.

చొప్పదండి: అఖిల భారత విద్యార్థి సమైక్య ఆవిర్భావ దినోత్సవం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ జెండా ఎగురవేశారు. దేశంలోని మొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని, విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ఉద్యమాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేశ్, ఆశిష్, దినేశ్, ప్రణయ్, సాయి కుమార్, తదితరులున్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జెండాను జిల్లా ఉపాధ్యక్షుడు సాగర్ ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, కౌశిక్, ఆదిత్య, సాత్విక్, నిఖిల్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుల తిప్పలు



శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామ శివారులో ఉపకాలువపై ఓ వైపు బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతుండగా అధికారులు వన్‌వేలో వాహనాలను దారి మళ్లించారు. దీంతో కరీంనగర్ -వరంగల్ రోడ్డుపై ఎదురెదురుగా భారీ వాహనాలు వచ్చినప్పుడు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఐదారు చోట్ల వన్‌వేతో సతమతమవుతున్నారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం

గంగాధర: రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆరు మండలాలకు చెందిన బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. కాంగ్రెస్ బీసీలను మోసం చేయాలని చూస్తే ఉద్యమం చేస్తామన్నారు.

సన్మానం

చొప్పదండి: ఐకేపీ ఏపీఎంగా సుదీర్ఘకాలం పని చేసి బదిలీపై వెళ్లిన గూడ నర్మదను మండలంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. నూతన ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించిన మట్టెల సంపత్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు రాగుల సౌమ్య, సీసీలు చంద్రనారాయణ, లక్ష్మణ్, శ్రీనివాస్, పర్శరాములు, వివోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

దీక్ష విరమించండి

వీణవంక: హుజూరాబాద్‌లోని ఏసీపీ కార్యాలయంలో హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామస్తులతో ఏసీపీ మాధవి సమావేశమయ్యారు. ఇసుక లారీలపై టాటిపత్రులు కప్పే ఉపాధి కల్పించాలని హిమ్మత్‌నగర్ గ్రామస్తులు 34రోజులుగా నిరసన దీక్ష చేస్తున్నారు. కొండపాక రెవెన్యూ గ్రామంలో హిమ్మత్‌నగర్ ఉందని ఉపాధి కల్పించాలని దీక్ష చేస్తున్నారు. మంగళవారం ఇరు గ్రామాల నాయకులతో చర్చించారు. రాబోయే స్థానిక ఎన్నికలు, వినాయక చవితి నేపథ్యంలో దీక్ష విరమించాలని హిమ్మత్‌నగర్ గ్రామస్తులకు సూచించినట్లు తెలిసింది. బుధవారం హిమ్మత్‌నగర్ గ్రామానికి ఏసీపీ వచ్చి దీక్ష విరమింపజేయనున్నారని గ్రామస్తులు తెలిపారు.

ఇల్లు మంజూరు చేయండి

చిగురుమామిడి: మండలంలోని గునుకులపల్లెలో కొమ్మెర భూపతిరెడ్డి ఇల్లు గతేడాది కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. అప్పటి నుంచి అద్దె ఇంటిలో నివసిస్తున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని ఆశించిన భూపతిరెడ్డికి నిరాశే మిగిలింది. తహసీల్దార్, కలెక్టర్‌కు ఇల్లు మంజూరు చేయాలని విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోయాడు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడంలేదని, పార్టీలతో సంబంధం లేకుండా ఇళ్లు అందిస్తున్నామని ప్రభుత్వం ఓ వైపు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో విరుద్ధంగా ఉందని ఆరోపించాడు.

రేపు ఇసుక వేలం

వీణవంక: మండలంలోని పలు గ్రామాలలో ఇటీవల పట్టుకున్న 22 ట్రాక్టర్ల ఇసుకకు హుజూరాబాద్ కోర్టు ఆదేశాల మేరకు 14న మధ్యాహ్నం 12 గంటలకు వేలం వేయనున్నట్లు తహసీల్దార్ రజిత ప్రకటనలో తెలిపారు. అక్రమంగా మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని కోర్టుకు రిమాండ్ చేశారు. ఒక్కో ట్రిప్పుకు రూ.1800 చొప్పున వేలం ఉంటుందని ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని సూచించారు. వివరాల కోసం తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అవగాహన సమావేశం



మాట్లాడుతున్న కంది తిరుపతిరెడ్డి

చిగురుమామిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు స్వశక్తి సంఘాల్లో చేరాలని హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి కోరారు. మంగళవారం చిగురుమామిడి టీసెర్ప్ ఐకేపీ కార్యాలయంలో సీఏ, వీవోబీలతో అవగాహన సమావేశం నిర్వహించారు. దివ్యాంగులను సంఘాల్లో చేర్పించాలని, కిషోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ నిర్ణయమన్నారు. గడపగడపకూ తిరుగుతూ సంఘాల్లో చేర్చాలని సూచించారు. ఏపీఎం రజిత మాట్లాడుతూ అల్యూమినీయం పాత్రలకు బదులుగా స్టీల్ పాత్రలు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మండల రజిత, మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెట్టు మొదలు వేసి నిరసన



గన్నేరువరం: ఇంటి ఎదుట బురద ఉందని మండల కేంద్రంలో మంగళవారం ఓ వ్యక్తి రోడ్డుపై అడ్డంగా చెట్టు మొదలు వేసి నిరసన తెలిపాడు. గన్నేరువరం నుంచి పారువెల్ల, ఖాసీంపేట గ్రామాల వైపు వెళ్లే రోడ్డుపై సంఘటన జరగడంతో ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కార్యదర్శి వెంకట్‌రెడ్డి పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని కాండం తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఇంటి ముందు బురదతో ఇబ్బందులు పడుతున్నామని తెలపగా ట్రాక్టర్‌తో బురద తొలగించినా నిరసన వ్యక్తం చేస్తున్నాడని కార్యదర్శి తెలిపారు.



ఇల్లందకుంట: మండలంలోని పాతర్లపల్లి -సిరిసేడు గ్రామాల మధ్య బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో రోడ్డుపై ప్రయాణం చేయడానికి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవీందర్, ఆర్అండ్‌బీ డీఈ హుజూరాబాద్ డివిజన్ నం.94408 18419

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

మానకొండూర్: చట్టాలపై యువత అవగాహన పెంచుకోవాలని కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటస్వామి సూచించారు.మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పత్రాలు సరిగా లేని 69 ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం తూర్పు దర్వాజా వద్ద మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్స్, డ్రంకెన్ డ్రైవ్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురికావొద్దన్నారు. సోషల్ మీడియా వినియోగంపై జాగ్రత్తగా ఉండాలని, వాహనాలు నడిపేటప్పుడు అన్నిరకాల పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో సీఐలు బి. సంజీవ్, సదన్ కుమార్, కోటేశ్వర్, నిరంజన్‌రెడ్డి, శ్రీలత, పుల్లయ్య పాల్గొన్నారు.

ఎస్సార్ రంగనాథన్ జయంతి



హుజూరాబాద్: నివాళి అర్పిస్తున్న పాఠకులు

హుజూరాబాద్: పట్టణంలోని లైబ్రరీలో మంగళవారం భారతదేశ గ్రంథాలయ పితామహుడు ఎస్సార్ రంగనాథన్ జయంతి నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తడికమళ్ల శేఖర్ మాట్లాడారు. గ్రంథాలయాలు మానవుని ఉన్నతికి పట్టుకొమ్మలుగా నిలుస్తూ జ్ఞానాభివృద్ధికి ఉపయోగపడుతున్నాయన్నారు. సమాజంలో ఉన్నత పౌరులుగా ఎదగటానికి ఉపయోగపడటమే కాకుండా గ్రంథ పఠనం విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు నిధిగా తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పరిపాలన అధికారి కె.కనకలక్ష్మి, పాఠకులు వేల్పుల రత్నం, సందెల వెంకన్న, కొంపెల్లి సంజీవ్, తిరుణహరి రమేష్, మహ్మద్ కాలీక్ హుస్సేన్, అమరేందర్ గౌడ్ తదితరులున్నారు.

వీణవంక: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్సార్ రంగనాథన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ రాజిరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల గ్రంథపాలకుడు రామ్మోహన్, అధ్యాపకులు భాస్కర్, శోభన్ బాబు, జయపాల్‌రెడ్డి, కరుణ, స్వప్న, శైలజ, కల్పన, జమీల్, రాజశేఖర్, విద్యార్థులు ఉన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు

మానకొండూర్: గ్రామ పరిధిలోని నాలాలు, ఆస్తులను ఆక్రమించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వి.జగదీశ్వర్ జీపీ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో ఇటీవల కొందరు మురుగుకాలువ ఆక్రమించగా పంచాయతీ అధికారులు జరిమానా విధిస్తూ నోటీసులు జారీ చేశారు. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి మురుగు కాలువలను పరిశీలించారు. గ్రామ పంచాయతీకి సంబంధించి ఆస్తులను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వెంట ఎంపీ ఓ కిరణ్ పంచాయతి కార్యదర్శి రేవంత్ రెడ్డి ఉన్నారు.

ప్రైవేటు పాఠశాల ఎదుట నిరసన

జమ్మికుంట: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం టీసీ ఇవ్వడం లేదని ఓ వ్యక్తి మంగళవారం నిరసన వ్యక్తం చేశాడు. బాధితునికి బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. మున్సిపల్ పరిధి రామన్నపల్లి గ్రామానికి చెందిన ఎండ్ల శ్రీనివాస్ కుమారుడు పాఠశాలలో ఏడో తరగతి పూర్తి చేశాడు. స్కూల్ ఫీజు పూర్తిగా చెల్లించాడు. టీసీ ఇవ్వాలని ప్రిన్సిపల్‌ను కోరగా రూ.రెండువేలు చెల్లించాలనడంతో పాఠశాల ఎదుట నిరసన తెలిపాడు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు మద్దతుగా తెలిపారు. సమస్యను ఎంఈవో హేమలత దృష్టికి తీసుకపోగా టీసీ కోసం ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదనడంతో సమస్య సద్దుమణిగింది. నిరసనలో బీజేపీ నాయకులు కైలాసకోటి గణేష్, పట్టణ ఉపాధ్యక్షురాలు ఇటికాల స్వరూప, రాకేష్ ఠాగూర్, మేడిపల్లి మహేష్, సిరయాల విజయ్, మ్యాదరి శంకర్ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మృతి

శంకరపట్నం: మండంలోని అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన గుడిసె మహేందర్(24) వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. మహేందర్ భార్య ప్రవళికకు ఇటీవల కూతురు పుట్టింది. భార్య, అత్త ఎల్లమ్మ మహేందర్‌ను దూషించడంతో ఈ నెల 4న గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడని, తల్లి పుష్పలత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

చెరువులోపడి వ్యక్తి..

జమ్మికుంట: పట్టణంలోని నాయిని చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. టౌన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు.. మతిస్థిమితం లేని పట్టణానికి చెందిన మహమ్మద్ జబ్బర్(64) మంగళవారం ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయాడని, మృతుడి అన్న కొడుకు ఇమ్రాన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని మంగళవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన గెల్లు చందు, వీణవంక మండం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మునిగాల ప్రకాశ్, నాగిళ్ల రమేశ్ ఇసుక రవాణా చేస్తుండగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పట్టుకున్నామని సీఐ వివరించారు.